సాక్షి
కాకినాడ
మంగళవారం । 29 । జూలై । 2025



నిత్యాన్నదాన పథకానికి విరాళం

అన్నవరం: సత్యదేవుని నిత్యాన్నదాన పథకానికి మాడేపల్లి నాగరాజు, కృష్ణవేణి దంపతులు (తాడేపల్లిగూడెం) సోమవారం రూ.1,01,116 విరాళం సమర్పించారు.



జనసేన నేతలపై చార్జిషీట్ వేయాలి

కులం పేరుతో తనను దూషించిన జనసేన పార్టీ నాయకులపై వెంటనే చార్జిషీట్ ఫైల్ చేయాలని ఫీల్డు అసిస్టెంట్ సునీత సోమవారం ఎస్పీ ఫిర్యాదు చేశారు.

తాడిని తలదన్నే రుచి!



ప్రస్తుత సీజన్‌లో దొరికేది తాటి పండు. ఈ తాటిపండులో అనేక పోషకాలు ఉంటాయి. ముంజెలు, పండ్లు, తేగలు అందిస్తూ అనేక విధాలుగా మనకు తాటి చెట్లు ఉపయోగ పడుతున్నాయి. తాటి పండుతో అనేక వంటకాలు కూడా చేసుకోవచ్చు.

8లో

న్యూస్‌రీల్

అనుబంధ విభాగాలతో పార్టీ బలోపేతం కావాలి



దాడిశెట్టి రాజాను కలిసిన సాయిప్రశాంత్

సాక్షి ప్రతినిధి, కాకినాడ: పార్టీ అనుబంధ విభాగాలు సమన్వయంతో పని చేయడం ద్వారా జిల్లాలో పార్టీ బలోపేతం కావాలని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు దాడిశెట్టి రాజా అన్నారు. కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాల పార్టీ అనుబంధ విభాగాల ఇన్‌చార్జిగా నియమితులైన వై.సాయిప్రశాంత్ కాకినాడలో సోమవారం రాజాను కలిశారు. ఈ సందర్భంగా రాజా మాట్లాడుతూ, జిల్లాలోని అనుబంధ విభాగాల ప్రతినిధులు పార్టీ అభ్యున్నతికి పాటు పడేలా సమన్వయంతో కృషి చేయాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న అనుబంధ విభాగాలను త్వరితగతిన నియమించాలన్నారు. పార్టీ అధికార ప్రతినిధి సుంకర విద్యాసాగర్, నాయకుడు బత్తుల సాయిరామ్ కూడా పాల్గొన్నారు.

ఆషాఢం ఆదాయం అదుర్స్

తలుపులమ్మ తల్లికి రూ.1.56 కోట్ల రాబడి




హుండీల ఆదాయం లెక్కిస్తున్న సిబ్బంది

తుని రూరల్: లోవ దేవస్థానంలో కొలువై ఉన్న తలుపులమ్మ అమ్మవారికి ఆషాఢ మాసం ఆదాయం రూ.1.56 కోట్లు లభించింది. అన్నవరం దేవస్థానం డిప్యూటీ కమిషనర్, సహాయ కార్యనిర్వహణాధికారి పి.బాబూరావు పర్యవేక్షణలో లోవ దేవస్థానం ఆవరణలో హుండీలను సోమవారం తెరిచారు. అమ్మవారి పంచ లోహ విగ్రహాల ప్రాంగణంలో ఆదాయం లెక్కించారు. నోట్లు రూ.63,15,141, నాణేలు రూ.4,42,318 కలిపి మొత్తం రూ.67,57,459 సమకూరిందని లోవ దేవస్థానం ఈఓ పెన్మెత్స విశ్వనాథరాజు తెలిపారు. ఆషాఢ మాసం నెల రోజులూ పూజా టికెట్లు, వసతి గదుల అద్దెలు, లడ్డూ, పులిహోర ప్రసాదాల విక్రయం, విరాళాల రూపంలో మరో రూ.88,59,239 ఆదాయం లభించిందని వివరించారు. మొత్తం రూ.1,56,16,698 ఆదాయం సమకూరిందన్నారు. గత సంవత్సరంతో పోల్చితే ఈసారి రూ.26.62 లక్షలు అధికంగా లభించిందన్నారు. నగదు లెక్కింపులో దేవస్థానం సిబ్బంది, శ్రీవారి సేవకులు, నాయీ బ్రాహ్మణులు, చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

పీ-4 నిర్బంధం చేస్తే బహిష్కరిస్తాం

అమలాపురం టౌన్: పీ-4 కార్యక్రమాన్ని నిర్బంధం చేస్తే బహిష్కరిస్తామని యూటీఎఫ్ కోనసీమ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.సురేంద్రకుమార్, ఎంటీవీపీఎస్ సుబ్బారావు సోమవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. పీ-4 కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు 5, ఉపాధ్యాయులు 2 పేద కుటుంబాలను తప్పనిసరిగా దత్తత తీసుకోవాలన్న అంక్షలు సమంజసం కాదన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సుధాకర్‌బాబు



సమావేశానికి తరలివచ్చిన దళితులు

ఉత్సాహం.. ఉత్తేజం

- వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ సమావేశానికి పోటెత్తిన దళితులు
- కూటమి సర్కారుపై నిప్పులు
- సాగనంపే వరకూ నిద్రపోబోమని ప్రతిన
- కేసులకు, దౌర్జన్యాలకు భయపడేది లేదని స్పష్టీకరణ
- జగన్‌ను సీఎంను చేయడానికి సిద్ధమంటూ నినాదం

సాక్షి ప్రతినిధి, కాకినాడ: కూటమి సర్కారుపై దళితుల్లో నెలకొన్న అసంతృప్తి కాకినాడలో సోమవారం జరిగిన వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ జిల్లా విస్తృత స్థాయి తొలి సమావేశంలో ప్రస్ఫుటమైంది. మాజీ మంత్రి, పార్టీ జిల్లా అధ్యక్షుడు దాడిశెట్టి రాజా పర్యవేక్షణలో జరిగిన ఈ సమావేశానికి ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు శెట్టిబత్తుల కుమార్‌రాజా అధ్యక్షత వహించారు. జిల్లా నలుమూలల నుంచీ పెద్ద సంఖ్యలో తరలివచ్చిన దళితులతో సమావేశ ప్రాంగణమైన సూర్య కళా మందిరం కిక్కిరిసిపోయింది. సగం మంది బయటే ఉండిపోవాల్సి వచ్చింది. ప్రారంభం నుంచి చివరి వరకూ జగన్ నినాదాలతో ఆ ప్రాంతం మార్మోగిపోయింది.

ఆకట్టుకున్న టీజేఆర్ ప్రసంగం

ముఖ్య అతిథిగా పాల్గొన్న పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు, సంతనూతలపాడు మాజీ ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు ప్రసంగం ఆద్యంతం ఆకట్టుకుంది. కూటమి 13 నెలల పాలనలో దళితులు, దళిత మహిళలపై వివక్ష, కక్షపూరితంగా జరుగుతున్న దాడులను తనదైన శైలిలో ఆయన ఎండగట్టిన తీరు సభికుల్లో రెట్టించిన ఉత్సాహాన్ని నింపింది. దళితుల సంక్షేమ పథకాల్లో పెడుతున్న కోతలను గణాంకాలతో అర్థమయ్యే రీతిలో వివరించారు. వారిని అణగదొక్కేందుకు చూస్తున్న కూటమి సర్కారును కడిగి పారేశారు. ఆ సందర్భంగా జై జగన్ నినాదాలు మిన్నంటాయి. 'మీ సంక్షేమం కోసం ఎన్నో పథకాలు తీసుకువచ్చిన జగన్‌ను ముఖ్యమంత్రిగా చేసుకోవడానికి నేను సిద్ధం. మీరు సిద్ధమేనా?' అంటూ ప్రశ్నించి అందరిలో ఉత్తేజాన్ని నింపారు. 'కూటమి సర్కారు పెట్టే కేసులకు బెదిరిపోయి బయటకు రారా.. తలలు పగలగొడతారని భయపడతారా.. ప్రాణాలైనా అర్పించడానికి వెనుకాడేది లేదు.. మన సంక్షేమ పథకాలను పునరుద్ధరించుకోవాలంటే జగన్‌ను సీఎంను చేసుకోవాలి' అని సుధాకర్‌బాబు నొక్కి చెప్పినప్పుడు.. 'ప్రాణాలైనా అర్పిస్తాం.. జగన్‌ను సీఎంను చేస్తాం' అనే నినాదాలతో సమావేశ మందిరం ప్రతిధ్వనించింది. దళితుల భవిష్యత్తు బాగుండేందుకు కూటమి సర్కారును సాగనంపేలా ప్రతి గ్రామం, ప్రతి మండలంలో దళితులు సత్తా చాటాలని పిలుపునిచ్చినప్పుడు దళితులు జగన్‌కు జై కొట్టారు.



సమావేశంలో ప్రసంగిస్తున్న దాడిశెట్టి రాజా

వెలుగుల కోసం సత్తా చాటాలి

పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కొమ్మూరి కనకారావు ప్రసంగం అందరినీ ఆలోచింపజేసింది. వెలుగుల నుంచి చీకట్లోకి నెట్టేసిన కూటమిని సాగనంపి.. తిరిగి వెలుగుల కోసం దళిత సత్తా చాటాలని పిలుపునిచ్చారు. దళితుల్లో పుట్టాలని ఎవరైనా అనుకుంటారా అన్న చంద్రబాబుకు, దళితులంటే నాకు మేనమామలు అన్న జగన్ మనస్తత్వానికి మధ్య ఉన్న వ్యత్యాసాన్ని కనకారావు అర్థమయ్యేలా వివరించినప్పుడు జనం చప్పట్లతో స్వాగతించారు. చంద్రబాబు కేబినెట్‌లో దళితులకు రెండే రెండు పదవులిస్తే.. జగన్ తన కేబినెట్‌లో హోం, విద్య, ఎక్సైజ్ వంటి కీలక శాఖలతో సమున్నత స్థానం కల్పించారని, ఆయనను తిరిగి సీఎంను చేసుకోవాలని అన్నప్పుడు 'సీఎం జగన్' అంటూ దళితులు ముక్తకంఠంతో నినదించారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు యువతులు అదృశ్యమయ్యారని దుష్ప్రచారం చేసిన పవన్.. అనంతపురంలో సామూహిక అత్యాచారంతో తల్లి అయిన బాలికను కనీసం పరామర్శించలేదంటూ కనకారావు తూర్పారబట్టిన తీరు ఆకట్టుకుంది.

జగన్ వెంటే దళితులు

- చంద్రబాబు మాటలు నమ్మి అన్ని వర్గాలూ మోసపోయినా దళితులు మాత్రం జగన్ వెంటే ఉన్నారని మాజీ మంత్రి దాడిశెట్టి రాజా అన్నారు. దేశమంతా అంబేడ్కర్ రాజ్యాంగం అమలవుతూంటే రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం నడుస్తోందంటూ పెదబాబు, చినబాబుల తీరును ఆయన ఎండగట్టారు.
- ఆవిర్భావం నుంచీ పార్టీకి వెన్నుదన్నుగా ఉన్న దళితులు జగన్‌ను మరోసారి సీఎంను చేసేంత వరకూ పోరాటాలకు సిద్ధపడాలని జిల్లా పరిషత్ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు పిలుపునిచ్చారు.
- అధికారం ఉన్నా లేకున్నా జగన్ వెంటే జనం.. అదే ప్రభంజనం అని మాజీ ఎంపీ వంగా గీత అన్నారు.
- 'ప్రాణాలైనా అర్పిద్దాం.. జగన్‌ను సీఎంను చేసుకుందాం. గ్రామ, మండల, జిల్లా స్థాయిల్లో దళిత ఫోర్స్‌తో సమన్వయంగా ముందడుగు వేద్దామని ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు శెట్టిబత్తుల కుమార్‌రాజా పిలుపునకు అనూహ్య స్పందన లభించింది. జగన్‌ను సీఎంను చేసుకుంటేనే మన సంక్షేమం మనకు తిరిగి దక్కుతుందనే విషయాన్ని ఆయన నొక్కి చెప్పారు.
- కూటమి పాలనలో దళితులు, దళిత మహిళలపై జరుగుతున్న దాడులు, అణచివేతలకు ఎదురొడ్డి పోరాడాల్సిన అవసరాన్ని మాజీ ఎమ్మెల్సీ అంగుళూరి శివకుమారి, మాల కార్పొరేషన్ మాజీ చైర్‌పర్సన్ పెదపాటి అమ్మాజీ, పార్టీ జిల్లా మహిళా అధ్యక్షురాలు వర్ధినీడి సుజాత, గుల్లా ఏడుకొండలు వివరించారు.
- 75 ఏళ్ల స్వాతంత్ర్య రాజకీయ చరిత్రలో తొలిసారి రెల్లి సామాజికవర్గానికి కాకినాడ డిప్యూటీ మేయర్ పదవి కట్టబెట్టిన జగన్ దళితుల పక్షపాతి అని మాజీ డిప్యూటీ మేయర్ మీసాల ఉదయ్‌కుమార్ అన్నారు.



జ్యోతి ప్రజ్వలనం చేస్తున్న సుధాకర్‌బాబు, దాడిశెట్టి రాజా, విప్పర్తి, వంగా గీత తదితరులు

అక్టోబర్ నుంచి దళిత ఫోర్స్ పర్యటనలు

పార్టీ అధిష్టానం ఆదేశాలతో అక్టోబర్ నుంచి గ్రామాలు, మండలాల్లో దళిత ఫోర్స్ పర్యటించాలంటూ కుమార్‌రాజా ప్రవేశపెట్టిన తీర్మానాన్ని సమావేశం ఏకగ్రీవంగా ఆమోదించింది. ఈ సమావేశంలో మాజీ మంత్రి తోట నరసింహం, మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, పార్టీ ఉభయ గోదావరి జిల్లాల ఎస్సీ సెల్ పరిశీలకులు బి.శ్రీనివాసరావు, ఎస్సీ సెల్ నియోజకవర్గాల అధ్యక్షులు బల్ల సూరిబాబు, పెదపాటి రమేష్ కుమార్, బంగారు కృష్ణ, గుడాల వెంకటరత్నం, లంక కృపానందం, భుల అబ్బులు కూడా ప్రసంగించారు. పార్టీ అధికార ప్రతినిధి సుంకర విద్యాసాగర్, యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తోట రాంజీ, అనుబంధ విభాగాల కోనసీమ, కాకినాడ పరిశీలకుడు వై.సాయిప్రశాంత్, మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శి రాగిరెడ్డి చంద్రకళాదీప్తి కుమార్, సిటీ అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, సిటీ మహిళా అధ్యక్షురాలు పసుపులేటి వెంకటలక్ష్మి, ప్రచార విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రావూరి వెంకటేశ్వరరావు, బీసీ సెల్, యువజన విభాగం జిల్లా అధ్యక్షులు అల్లి రాజబాబు, రాగిరెడ్డి బన్ని, సిటీ యూత్ అధ్యక్షుడు రోకళ్ల సత్య తదితరులు పాల్గొన్నారు. తొలుత దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి, అంబేడ్కర్, బాబూ జగ్జీవన్‌రామ్ చిత్రపటాలకు నివాళులర్పించారు. సామర్లకోట ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు వందన సమర్పణ చేశారు.

దళితుల సత్తా చూపాలి

కూటమి ప్రభుత్వం దళితుల హక్కులు కాలరాస్తూ వారి పథకాలను ఎత్తేస్తోంది. 2027 లేదా 2029 ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తిరిగి సీఎంను చేసుకోవడం ద్వారా దళితుల సత్తా ఏమిటో తెలియజేయాల్సిన సమయం ఆసన్నమైంది. జగన్ తన ఐదేళ్ల పాలనలో లబ్ధిదారుల ఖాతాల్లో నేరుగా రూ.2.75 లక్షల కోట్లు జమ చేశారు. ఇందులో 40 శాతం అంటే రూ.37 వేల కోట్లు దళితులకే వెళ్లాయి. కూటమి ప్రభుత్వం పథకాలన్నింటినీ ఆపేసి దళితుల అభ్యున్నతిని దెబ్బ తీస్తోంది. కూటమి పాలనలో ఏటా రూ.10 వేల కోట్ల మేర దళితులు నష్టపోతున్నారు. పవన్ కల్యాణ్ సినిమాల్లో చేస్తున్న పాత్రలు చూసి సామాజిక న్యాయం పాటిస్తారనుకున్నాం. అంబేడ్కర్ రాజ్యాంగం ప్రకారం ఉప ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన పవన్.. తాను సనాతన వాదినని చెప్పుకోవడమేమిటో అర్థం కావడం లేదు. పవన్‌ను చూసి రాజకీయం సిగ్గుతో తల వంచుకుంటోంది. వచ్చే ఎన్నికల్లో జగన్‌ను సీఎంను చేసుకోవడానికి దళితులు, మైనార్టీలు ప్రాణాలర్పించడానికి కూడా వెనుకాడరు. 13 నెలల చంద్రబాబు పాలనలో చినబాబు రెడ్‌బుక్ రాజ్యాంగంతో వారి స్థాయి ఏమిటో ప్రజలకు తెలిసొచ్చింది. మీ పాలన ఇక వెయ్యి రోజులు మాత్రమే, 1001 రోజు కచ్చితంగా మీకు



దళితుల సత్తా ఏమిటో తెలిసొస్తుంది. అంబేడ్కర్ స్మృతివనాన్ని పీపీపీ విధానంలో వ్యాపార కేంద్రంగా మార్చేందుకు చంద్రబాబు కుట్రలు పన్నుతున్నారు. కూటమి అధికారంలోకి వచ్చిన 13 నెలల కాలంలో తల్లికి వందనం తప్ప మరో పథకమేదైనా అమలు చేసిందా? ఈ పథకాన్ని దళిత, బలహీనవర్గాలకు కాకుండా టీడీపీ నేతలకు దోచి పెడుతున్నారు. క్యాబినెట్ మంత్రి అయి ఉండి అచ్చెన్నాయుడు సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయాలంటే రాష్ట్రాన్ని అమ్మేయాలని ఎలా అన్నారు?

– టీజేఆర్ సుధాకర్‌బాబు, వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు

శ్రీరస్తు.. శుభమస్తు..

- వివాహ సందడి మళ్లీ ప్రారంభం
- నవంబర్ 26 వరకూ ముహూర్తాలే
- ఫంక్షన్ హాల్స్, టెంట్‌హౌస్‌లు, బ్యాండ్ మేళాలకు డిమాండ్

కాకినాడ సిటీ: సుమారు 80 రోజుల విరామం తర్వాత శుభకార్యాలకు మళ్లీ మంచి ముహూర్తాలు మొదలయ్యాయి. దీంతో జోరుగా పెళ్లి బాజాలు మోగనున్నాయి. మే 25 నుంచి జూలై 26 వరకు ముహూర్తాలు లేకపోవడంతో శుభకార్యాలకు బ్రేక్ పడింది. శ్రావణ మాసం శుభకార్యాలకు శ్రేష్ఠం కావడం.. ఈ నెల 27 నుంచి నవంబర్ 26వ తేదీ వరకూ 35 మంచి ముహూర్తాలు ఉండటంతో లగ్గాలు, వివాహాలు, నూతన గృహ ప్రవేశాలు జోరుగా జరగనున్నాయి. ఈ నెల 30, 31; ఆగస్టు 1, 3, 5, 6, 7, 8, 9, 10, 11, 12, 13, 14, 17, 20; సెప్టెంబర్ 24, 26, 27, 28; అక్టోబర్ 1, 2, 3, 4, 8, 10, 11, 12, 22, 24, 29, 30, 31; నవంబర్ 1, 2, 7, 8, 12, 13, 15, 22, 23, 26 తేదీల్లో మంచి ముహూర్తాలున్నాయి. ఈ నాలుగు నెలల్లో మొత్తం 35 ముహూర్తాలు ఉండటంతో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో లెక్కకు మిక్కిలిగా వివాహాలు జరగనున్నాయని పురోహితులు చెబుతున్నారు.



వీరికి డిమాండ్

వివాహాల సీజన్ మొదలవడంతో పురోహితులు, బ్యాండ్ మేళాలు, టెంట్‌హౌస్‌లు, డెకరేషన్, ఫొటో, వీడియోగ్రాఫర్లకు ఒక్కసారిగా డిమాండ్ ఏర్పడింది. ఇప్పటికే పలు ప్రాంతాల్లో వీరిని ముందుగానే మాట్లాడుకున్నారు. పెళ్లివారు ముందుగానే అడ్వాన్స్‌లు కూడా ఇచ్చారు. మరోవైపు ఫంక్షన్ హాళ్లకు కూడా ఎక్కడ లేని డిమాండూ వచ్చింది. ఇప్పటికే ముహూర్తాలు నిర్ణయించుకున్న వారు 2 నెలల ముందే ఫంక్షన్ హాళ్లు బుక్ చేసుకున్నారు. ఉమ్మడి జిల్లాలో 3,500కు పైగా ప్రైవేట్ ఫంక్షన్ హాల్స్, మరో వెయ్యి వరకూ టీటీడీ, ప్రభుత్వ కమ్యూనిటీ హాళ్లు ఉన్నాయి. చాలా మంది ఫంక్షన్ హాల్స్ దొరక్కపోవడంతో ఇళ్ల వద్ద ఖాళీ స్థలాల్లో సైతం వివాహాలు జరపడానికి సిద్ధపడుతున్నారు.

ప్రారంభమైన వివాహాలు



శ్రావణ మాసం ప్రారంభం కావడం.. నవంబర్ 26 వరకూ వివాహ ముహూర్తాలు ఉండటంతో జిల్లాలో అధిక సంఖ్యలో జంటలు ఒక్కటి కానున్నాయి. ఇప్పటికే 150కి పైగా పెళ్లిళ్లకు ముహూర్తాలు పెట్టాను.

– సుబ్రహ్మణ్యశాస్త్రి, పండితులు, కాకినాడ

టెంట్ హౌస్‌లకు ఫుల్ గిరాకీ

పెళ్లిళ్ల సీజన్ కావడంతో ముందుగానే టెంట్‌హౌస్ సామగ్రిని బుక్ చేసుకుంటున్నారు. ఆర్డర్స్ ఎక్కువగా వస్తున్నాయి. సుమారు 80 రోజులుగా శుభ కార్యాలు లేకపోవడంతో ఖాళీగా ఉన్నాం. ప్రస్తుతం టెంట్‌హౌస్‌లకు గిరాకీ పెరిగింది.

– కొండబాబు, టెంట్‌హౌస్ నిర్వాహకుడు, కాకినాడ

తల్లికి వంచన ఎందుకు?

- తల్లికి వందనం డబ్బులు రాకపోవడంపై ఆగ్రహం
- కలెక్టరేట్‌కు పెద్ద సంఖ్యలో క్యూ కట్టిన తల్లిదండ్రులు
- పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదుల వెల్లువ

కాకినాడ సిటీ: ప్రజా సమస్యల పరిష్కార వేదికలో తమ సమస్యలు చెప్పుకొనేందుకు జిల్లా నలుమూలల నుంచీ ప్రజలు కలెక్టరేట్‌కు తరలివచ్చారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమంలో తమ ఇబ్బందులు ఏకరువు పెట్టారు. ఎన్నడూ లేనివిధంగా ఏకంగా 921 మంది తమ సమస్యలపై అర్జీలు సమర్పించారు. ముఖ్యంగా తల్లికి వందనం నగదు తమకు జమ కాలేదంటూ అత్యధిక సంఖ్యలో ప్రజలు తరలి వచ్చారు. అర్హతలున్నప్పటికీ తమకు తల్లికి వందనం డబ్బులివ్వలేదని, ఈ వంచన ఏమిటని ప్రశ్నించారు. దీంతో కలెక్టరేట్‌లో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఒక దశలో అర్జీలదారులను నియంత్రించలేక కలెక్టరేట్ సిబ్బంది, పోలీసులు చేతులెత్తేశారు. చివరకు తల్లికి వందనం అర్జీలు స్వీకరించేందుకు కలెక్టర్ షణ్మోహన్ ప్రత్యేక అధికారిని ఏర్పాటు చేయాల్సి వచ్చింది. ప్రత్యేక క్యూలు ఏర్పాటు చేసి మరీ అర్జీలు స్వీకరించారు. తల్లికి వందనం నగదు జమపై విద్యా శాఖ అధికారులు ప్రత్యేకంగా దృష్టి సారించాలని, పేద విద్యార్థుల తల్లులకు డబ్బులు ఎందుకు పడలేదో సంతృప్తికరమైన సమాధానం ఇవ్వాలని, అర్హుల జాబితా తయారు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. నిర్లిప్తంగా విధులు నిర్వహిస్తే కుదరదని స్పష్టం చేశారు. విద్యుత్ బిల్లులు అధికంగా వచ్చాయనే పేరుతో తల్లికి వందనం పథకానికి అర్హులు కాదంటూ తమ పిల్లలను పక్కన పెట్టడం సరి కాదని పలువురు తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. కొన్ని సచివాలయాల్లో తల్లికి వందనం ఆన్‌లైన్ నమోదును ఇష్టానుసారం చేశారని, దీంతో తమ పిల్లలు ఈ పథకానికి దూరమయ్యారని ఆరోపించారు. ఒకవైపు అధిక ఉష్ణోగ్రతలు నమోదు కావడం, మరోవైపు విద్యుత్ చార్జీలు పెంచడం వంటి కారణాలతో అంశాలతో బిల్లులు పెరిగిపోయాయని చెప్పారు. ప్రభుత్వం విద్యుత్ బిల్లులను లెక్కల్లోకి తీసుకోవడం సరికాదని, తమ పిల్లలు పేదలా, కాదా అనేది ప్రత్యక్షంగా చూడాలని డిమాండ్ చేశారు. పేద, మధ్య తరగతి వర్గాల పిల్లల చదువును ప్రోత్సహించే ఉద్దేశంతో అమ్మ ఒడి పథకం ప్రవేశపెట్టారని, పిల్లలను బడికి పంపిన ప్రతి తల్లికీ గతంలో ఏటా రూ.15 వేల చొప్పున అందించారని గుర్తు చేశారు. కుల, మత, వర్గ, రాజకీయాలకు అతీతంగా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చదివిన విద్యార్థులకు అమ్మ ఒడి అందేదని చెప్పారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఒక ఏడాది కాలం తల్లికి వందనం రాలేదని, రెండో ఏడాది వస్తుందని ఎదురు చూస్తూంటే వివిధ రకాల కారణాలతో ఈ పథకాన్ని దూరం చేశారని వాపోయారు. గతంలో మాదిరిగానే పాఠశాలలకు వెళ్లే పిల్లల తల్లిదండ్రులందరికీ తల్లికి వందనం పథకాన్ని అందించాలని కోరారు.



తల్లికి వందనం డబ్బులు రాలేదంటూ కలెక్టరేట్‌కు క్యూ కట్టిన జనం నుంచి అర్జీలు స్వీకరిస్తున్న ప్రత్యేక అధికారి



ప్రజల సమస్యలు వింటున్న కలెక్టర్ షణ్మోహన్

సంతృప్తికరమైన పరిష్కారం చూపండి

పీజీఆర్ఎస్ కార్యక్రమంలో ప్రజల నుంచి స్వీకరించిన అర్జీలకు ఆయా శాఖల అధికారులు సంతృప్తికరమైన పరిష్కారాలు చూపించాలని కలెక్టర్ షణ్మోహన్ అధికారులను ఆదేశించారు. పీజీఆర్ఎస్ కార్యక్రమంలో ప్రజల నుంచి ఇతర అధికారులతో కలసి ఆయన అర్జీలు స్వీకరించారు. తల్లికి వందనం, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు, బియ్యం కార్డు మంజూరు, కార్డులో పేర్ల మార్పులు, చేర్పులు, పింఛన్లు, ఇళ్ల స్థలాలు, ఆన్‌లైన్‌లో భూమి వివరాల నమోదు, రీ సర్వే, ఆక్రమణల తొలగింపు, డ్రైన్, కాలువల్లో పూడికల తొలగింపు, పారిశుధ్యం, తల్లికి వందనం ఆన్‌లైన్ తదితర సమస్యలపై ప్రజలు అర్జీలు సమర్పించారు.

క్లుప్తంగా

ముస్తాబవుతున్న రత్నగిరి సత్రాలు

అన్నవరం: శ్రావణమాసం ప్రారంభమై వివాహాల సీజన్ కూడా మొదలవడంతో పెళ్లిబృందాలతో రత్నగిరిపై ప్రత్యేక సందడి నెలకొంది. దీంతో ఆలయానికి విచ్చేసే భక్తులు, పెళ్లిబృందాల అద్దెకిచ్చేందుకు రత్నగిరిపై ప్రధాన సత్రాలైన ప్రకాష్‌సదన్, న్యూ సీసీ, ఓల్డ్ సీసీ సత్రాల గదులను ముస్తాబు చేస్తున్నారు. సత్రాలలో గదులకు మరమ్మతులు చురుకుగా జరుగుతున్నాయి. గత నెలలో రూ.1.20 కోట్లతో న్యూ సెంటినరీ, ఓల్డ్ సెంటినరీ, ప్రకాష్‌సదన్ సత్రాలలో మరమ్మతులకు టెండర్లు పిలిచి ఖరారు చేశారు. నెల రోజులుగా సత్రాలకు మరమ్మతులు చేసి గదులలో పాడయిన ఫర్నిచర్, శానిటరీ, విద్యుత్ ఉపకరణాల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేస్తున్నారు. పెయింట్లు వేస్తున్నారు. సత్రాలలో జరుగుతున్న మరమ్మతు పనులను దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్ సోమవారం పరిశీలించారు. సగానికి పైగా సత్రాల గదులలో మరమ్మతులు పూర్తయ్యాయని ఈఈ రామకృష్ణ ఆయనకు వివరించారు. న్యూసీసీ సత్రంలో 48 గదులకు గాను 20 గదులలో మరమ్మతులు పూర్తి చేసి భక్తులకు అద్దెకిచ్చేందుకు వీలుగా సీఆర్వో అధికారులకు అప్పగించామని వివరించారు. ఓల్డ్ సీసీ సత్రంలో 48 గదులకు 23 గదులలో, ప్రకాష్‌సదన్‌లో 86 గదులలో సగం గదులకు మరమ్మతులు పూర్తి చేశామని వివరించారు.

ఇన్‌స్టాగ్రామ్‌లో అమ్మాయి ఫొటోతో వివాదం

బిక్కవోలు: మండలంలోని బిక్కవోలు గ్రామానికి చెందిన జుంజూరి విశ్వ తేజకు తన ఇన్‌స్టాగ్రామ్‌లో గుర్తు తెలియని అమ్మాయి ఫొటో పెట్టుకోవడం వల్ల వివాదం ఏర్పడిందని ఎస్సై వాసంశెట్టి రవిచంద్రకుమార్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ బిక్కవోలుకు చెందిన విశ్వతేజ రాజమహేంద్రవరంలో ఎలక్ట్రికల్ కార్ల షోరూమ్‌లో పనిచేస్తున్నాడు. తన ఇన్‌స్టాగ్రామ్‌లో గుర్తు తెలియని అమ్మాయి ఫొటో పెట్టుకున్నాడు. ఈ నెల 18న బిక్కవోలుకు చెందిన కొండాసాయి ఫోన్ చేశాడు. నా ప్రియురాలి ఫొటో ఎందుకు పెట్టుకున్నావు అని బూతులు తిట్టాడు. ఆదివారం తేజ బిక్కవోలు వచ్చాడు. సాయి ఫోన్ చేసి మధ్యాహ్నం హైస్కూల్ వద్దకు రా మాట్లాడుకుందామని చెప్పడంతో తేజ తన స్నేహితుడిని తీసుకువెళ్లాడు. సాయి, మరో ముగ్గురు అతనిని, మిత్రుడిని కొట్టారు. చుట్టుపక్కల వారు అడ్డుకున్నారు. తేజను అనపర్తి సీహెచ్‌సీకి తరలించారు. తేజ ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

అంబాజీపేట కొబ్బరి మార్కెట్

కొబ్బరి రకం	ధర (రూ.ల్లో)
కొత్తకొబ్బరి (క్వింటాల్)	23,000 – 23,500
కొత్తకొబ్బరి (రెండవ రకం)	10,500 – 12,000
కురిడీ కొబ్బరి (పాతవి)	
గండేరా (వెయ్యి)	27,500
గటగట (వెయ్యి)	25,500
కురిడీ కొబ్బరి (కొత్తవి)	
గండేరా (వెయ్యి)	26,000
గటగట (వెయ్యి)	24,000
నీటికాయ,పాత (ముక్కుడు)కాయ (వెయ్యి)	19,000 – 20,000
కొత్త (పచ్చి)కాయ (వెయ్యి)	19,000 – 20,000
కొబ్బరి నూనె (15 కిలోలు)	3,750
ఒక కిలో	260

తాడిని తలదన్నే రుచి!

- తాటి పండ్లతో అనేక ప్రయోజనాలు
- వాటితో చేసే వంటకాలు అద్భుతం
- నోరూరించేలా గారెలు, బూరెలు


విక్రయానికి సిద్ధంగా తాటి పండ్లు


నూనెలో వేగుతున్న తాటి బూరెలు



తాటి పండ్లతో తయారైన బూరెలు, తాటి అప్పాలు

సామర్లకోట: ప్రస్తుత సీజన్‌లో దొరికేది తాటి పండు. ఈ తాటిపండులో అనేక పోషకాలు ఉంటాయి. ముంజెలు, పండ్లు, తేగలు అందిస్తూ అనేక విధాలుగా మనకు తాటి చెట్టు ఉపయోగపడుతున్నాయి. పూర్వం తాటిచెట్టు, ఆకులతో ఇళ్ల నిర్మాణం జరిగేది. క్రమేపీ పెంకుటిళ్లు, ప్రస్తుతం డాబాలు వచ్చాయి. ప్రకృతి మనకు ప్రసాదించిన పండ్లను తినడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుంది. తాటి పండుతో అనేక రకాల వంటకాలు చేసుకోవచ్చు. వాటి రుచి ఎంతో అద్భుతంగా ఉంటుంది. తాటిచెట్టుకు కాసిన ముంజెకాయలు ముదిరిపోవడంతో తాటి పండ్లుగా మారుతాయి. ఆ పండ్ల గుంజుతో బూరెలతో పాటు అనేక రకాల పిండి వంటలు తయారు చేస్తారు.

రసాయనాలు లేని ఏకైక పండు

గ్రామీణ ప్రాంతాలకు చెందినవారు 20 ఏళ్ల క్రితం వరకు ప్రస్తుత సీజన్‌లో తాటిపండ్లతోనే కడుపు నింపుకునే వారు. చెట్టు నుంచి పడిన పండును నేరుగా కొందరు, నిప్పులపై కాల్చుకొని మరి కొందరు ఈ పండ్లను తొక్కలు తీసి నేరుగా తినేవారు. అయితే ప్రస్తుతం ఈ పండ్లను దూరం పెడుతున్నారు. తాటి పండులో అనేక పోషకాలు ఉన్నాయి. ఎటువంటి పురుగు మందులు, రసాయనాలు వాడని తాటి పండ్లు వినియోగం ఆరోగ్యదాయకం. ప్రస్తుతం గ్రామీణ ప్రాంతాలకు చెందిన వంటకాలకు డిమాండ్ పెరిగింది. దాంతో పండ్లను రోడ్డు మార్జిన్‌లో విక్రయించే వారి సంఖ్య పెరుగుతోంది. తాటిపండులో విటమిన్ ఎ,సీలు ఉంటాయి. బి కాంప్లెక్స్ పుష్కలంగా లభిస్తుంది. ఎక్కువగా పీచు పదార్థాలు ఉండటం వలన జీర్ణకోశ వ్యాధులు, మలబద్ధకం దూరం అవుతుంది. రక్త శుద్ధికి, మెదడుకు గ్లూకోజ్ అందించడంలో ఈ పండు దోహదపడుతుంది. నేటి తరం వారికి ఈ తాటిపండు విలువ తెలియడం లేదు. దీనికితోడు తాటి చెట్లను నరికి వేయడంతో ఇవి రాను రాను కనుమరుగైపోతున్నాయి.

అనేక వంటకాలు

తాటి పండ్లతో అనేక రకాల వంటకాలను తయారు చేస్తారు. వీటితో చేసే బూరెలు, గారెలు, రొట్టెలు, అప్పాలు ఎంతో రుచిగా ఉంటాయి. తాటికాయ గుంజు తీసి దానిలో వరి నూక, బెల్లం కలిపి బూరెలు, గారెలు, రొట్టెలు తయారు చేస్తారు. కొన్ని మిఠాయి దుకాణాల్లో ఆంధ్రా పిండి వంటకాల పేరుతో తాటి బూరెల విక్రయాలు సాగుతున్నాయి. వీటి ధర కూడా అధికంగానే ఉంటుంది.

అధిక శ్రమతో కూడిన పని



తాటి పండ్లతో పిండి వంటలు చేయడం ఎంతో శ్రమతో కూడుకున్న పని. శుభకార్యాలలో వేసే బూరెలను సులభంగా తయారు చేయవచ్చు. తాటి పండ్లతో బూరెలు చేయడానికి కనీసం ఇద్దరు ఉండాలి. తాటి పండ్లను నిప్పులపై మగ్గ బెట్టాలి. వాటి తొక్క తీసి గుంజును పీచు లేకుండా తీయాలి. పండ్ల తీపిని బట్టి తగిన మోతాదులో బెల్లం కలపాలి. అప్పటికే నీటిలో నానబెట్టిన నూకను తాటిపండ్ల గుంజులో బాగా కలపాలి. సుమారు 30 నిమిషాలు ఉంచిన తరువాత నూనెలో కావలసిన పరిమాణంలో తాటి బూరెలు, అప్పాలు, గారెలు తయారు చేసుకోవచ్చు. వీటిని ఒకసారి రుచి చూస్తూ వదలిపెట్టే ప్రసక్తి ఉండదు!

– మచ్చా బిందు, వీకే రాయపురం, సామర్లకోట మండలం

అనేక పోషకాలు



తాటిచెట్ల నుంచి వచ్చే పండ్లలో మంచి పోషకాలు ఉంటాయి. తాటిపండులో విటమిన్లు ఏ,బీ,సీ.. జింక్, పోటాషియం, ఐరన్, క్యాల్షియం వంటి అనేక ఖనిజాలు ఉంటాయి. తాటిపండులో పోషకాలు క్యాన్సర్ నిరోధకంగా పని చేస్తాయి. జ్ఞాపకశక్తిని పెంచటంలో తాటిపండు దోహదపడుతుంది. తాటిపండు వికారం తొలగించడంలో ప్రభావవంతంగా పని చేస్తుంది. తాటి పండ్లతో పిండి వంటలు తయారు చేసేవారు కనిపిం చడం లేదు. ఆ పిండి వంటలు ఎంతో రుచిగా ఉంటాయి. చిన్నతనంలో స్నేహితులతో కలిసి తినే వారం.

– పసల సత్యానందరావు, డాక్టర్, సామర్లకోట

వైఎస్సార్ సీపీ నేత షర్మిలారెడ్డి ఇంట్లో అగ్ని ప్రమాదం

రూ.10 లక్షల వరకు నష్టం


షర్మిలారెడ్డి ఇంటిలో నుంచి వస్తున్న పొగలు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): వైఎస్సార్ సీపీ నాయకురాలు మేడపాటి షర్మిలారెడ్డి ఇంటిలో అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. ఫైర్ ఆఫీసర్ శ్రీనివాస్ సోమవారం ఆ వివరాలను తెలిపారు. షర్మిలారెడ్డి, ఆమె భర్త అనిల్‌రెడ్డితో కలిసి కొద్దిరోజుల క్రితం లండన్‌లో ఉంటున్న వారి కుమార్తె గ్రాడ్యుయేషన్ కార్యక్రమంలో పాల్గొనేందుకు వెళ్లారు. అయితే ఇంటిలో కరెంట్ షార్ట్ సర్క్యూట్ జరిగింది. దీంతో ఇంటిలోని ఫర్నిచర్‌కు మంటలు అంటుకుని ఇల్లంతా పొగ కమ్మేసింది. ఇల్లు లాక్ చేసి ఉండడంతో ఆ పొగలు భవనం పైకి వచ్చాయి. దీన్ని చూసిన స్థానికులు వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందిచారు. వారు వచ్చి తలుపులను పగులకొట్టి మంటలను ఆర్పారు. ఈ ప్రమాదంలో ఇంటిలో సుమారు రూ.10లక్షల విలువైన ఫర్నిచర్ ధ్వంసమైంది. అగ్నిప్రమాదం వార్త తెలిసిన వెంటనే వచ్చి సహాయం అందించిన ఫైర్ సిబ్బంది, తన అభిమానులకు షర్మిలారెడ్డి ధన్యవాదాలు తెలిపారు.

జనసేన నేతలపై చార్జిషీట్ వేయాలి

ఎస్పీకి ఫీల్డు అసిస్టెంట్ ఫిర్యాదు


ఆత్మహత్యకు యత్నించి, కాకినాడ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న ఫీల్డు అసిస్టెంట్ సునీత (ఫైల్)

కరప: జనసేన పార్టీ నాయకులు తనను కులంపేరుతో దూషించడమే కాకుండా వేధింపులకు గురిచేశారని, వారిపై ఎఫ్ఐఆర్ నమోదు చేసినా ఇంతవరకు చార్జిషీట్ ఫైల్ చేయలేదని ఫీల్డు అసిస్టెంట్ పులపకూర సునీత సోమవారం ఎస్పీని కలసి ఫిర్యాదు చేశారు. తన చావుతో న్యాయం జరుగుతుందని పోలీసులు భావిస్తే దానికైనా సిద్ధంగా ఉన్నానని బాధితురాలు ఫిర్యాదులో పేర్కొన్నారు. బాధితురాలు సునీత జిల్లా ఎస్పీ బిందుమాధవ్‌కు చేసిన ఫిర్యాదు వివరాలు ఇలా ఉన్నాయి... కరప మండలం పెనుగుదురు గ్రామానికి చెందిన పులపకూర వీరబాబు భార్య సునీత ఉపాధిహామీ పథకం ఫీల్డు అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు. అదే గ్రామానికి చెందిన జనసేన పార్టీ నాయకుడు బండారు మురళి ఫీల్డు అసిస్టెంట్ సునీతను కులంపేరుతో దూషించడమే కాకుండా, కోరిక తీర్చాలని లేదా డబ్బు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ మానసికంగా వేధింపులకు గురిచేసేవాడు. ఆ వేధింపులు తాళలేక గతేడాది అక్టోబర్ నెల 22వ తేదీన నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యకు పాల్పడింది. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వేధింపులకు గురిచేసిన జనసేన నాయకులు బండారు మురళి, ఘంటా నానిబాబు, గుబ్బల భవానీలపై అదే నెల 28వ తేదీన ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. కేసు నమోదు చేసి ఐదునెలలు అవుతున్నా చార్జిషీట్ ఫైల్ చేయకపోవడంపై ఈ ఏడాది మార్చి 10న, ఏప్రిల్ 7న కలెక్టరేట్ గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు. అయినా ఎవరూ పట్టించుకోలేదు. ఈ నెల 21న కరప పోలీసులు తన వద్దకు వచ్చి బండారు మురళి, మరో ఇద్దరిపై పెట్టిన కేసు కొట్టివేశారు.. కాగితాలపై సంతకం చేయమని అడిగారని, సంతకం చేయనని చెప్పడంతో పోలీసులు వెళ్లిపోయినట్టు ఫిర్యాదులో పేర్కొన్నారు. తనను వేధింపులకు గురి చేసినవారిపై చార్జిషీట్ వేసి, వారిని అరెస్ట్ చేసి తనకు న్యాయం చేయాలని కోరుతూ ఫిర్యాదు చేసినట్టు సునీత తెలిపారు. తన చావుతో న్యాయం జరుగుతుందని పోలీసులు భావిస్తే అందుకు సిద్ధంగా ఉన్నట్టు ఆమె తెలిపారు.

జాబ్‌చార్టుపై అవగాహన అవసరం

ఎంపీడీఓల శిక్షణలో రాష్ట్ర అదనపు కార్యదర్శి వెంకటకృష్ణ


ఎంపీడీఓల శిక్షణలో మాట్లాడుతున్న అదనపు కార్యదర్శి వెంకటకృష్ణ

సామర్లకోట: ఎంపీడీఓలు తమ జాబ్‌చార్టుపై అవగాహన పెంచుకోవాలని, ఇదే తరుణంలో గ్రామ పంచాయతీల సొంత వనరుల ఆదాయాన్ని పెంచడంపై దృష్టి పెట్టాలని రాష్ట్ర అదనపు కార్యదర్శి కె.వెంకటకృష్ణ అన్నారు. స్థానిక విస్తరణ శిక్షణ కేంద్రంలో నెల రోజుల పాటు నిర్వహించే శిక్షణకు సోమవారం ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఉమ్మడి జిల్లాలైన శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి జిల్లాలో పదోన్నతి పొందిన 46 మందికి మొదటి బ్యాచ్‌లో శిక్షణను ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీలకు సొంత వనరులు సమీకరణ, ఆర్థిక సుస్థిరత ఎంతో అవసరమని తెలిపారు. ప్రభుత్వాలు అందిస్తున్న ఆర్థిక సహాయం ఆయా గ్రామ పంచాయతీలకు సరిపోదన్నారు. గ్రామ పంచాయతీలు సమగ్రాభివృద్ధికి, సంక్షేమానికి వివిధ కార్యక్రమాలను చేపట్టవలసి ఉంటుందని పేర్కొన్నారు. గ్రామ స్థాయిలో సామాజిక న్యాయంతో కూడిన ఆర్థికాభివృద్ధి ప్రణాళికలు, బహుముఖ అభివృద్ధి కార్యక్రమాలు, మౌలిక సదుపాయాల కల్పన, సంక్షేమ కార్యక్రమాల అమలులో మండల పరిషత్తు పాలక మండలి సలహాలు, సూచనలు తీసుకోవాలన్నారు. ఎంపీపీల నిర్ణయాలనే పాటించవలసిన పనిలేదన్నారు.

విస్తరణ శిక్షణ కేంద్రం ప్రిన్సిపాల్ కేఎస్‌వీ ప్రసాదరావు మాట్లాడుతూ ఎంపీడీఓ విధి నిర్వహణలో మండల ప్రజా పరిషత్తుకు, ప్రభుత్వానికి బాధ్యతగా వ్యవహరించాలని తెలిపారు. డ్వామా ఏపీడీ భానుప్రకాష్, ఈటీసీ వైస్ ప్రిన్సిపాల్ జి.రమణ, ఎంపీడీవో డి.శ్రీలలిత, ఫ్యాకల్టీలు శర్మ, డి.శ్రీనివాసరావు, కె సుశీల మొదటి రోజు శిక్షణ నిర్వహించారు.


నవోదయ కబడ్డీ మీట్‌కు వస్తున్న క్రీడాకారులు


పేర్లు నమోదు చేయించుకుంటున్న బాలికలు

నేటి నుంచి ఆటల పండగ

జవహర్ నవోదయలో మూడు రోజుల పాటు కబడ్డీ పోటీలు

పెద్దాపురం: స్థానిక జవహర్ నవోదయ విద్యాలయలో ఈ నెల 29 నుంచి మూడు రోజుల పాటు ఆటల పండగ పేరుతో కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు విద్యాయల ప్రిన్సిపాల్ బి.సీతాలక్ష్మి తెలిపారు. దీనిలో భాగంగా సోమవారం తెలంగాణ, ఏపీ, కర్ణాటక ప్రాంతాలకు చెందిన సుమారు 450 మంది క్రీడాకారుల రిజిస్ట్రేషన్ ప్రక్రియ నిర్వహించారు. 29వ తేదీ ఉదయం 9 గంటలకు క్రీడాజ్యోతి, క్రీడార్యాలీ, శాంతికపోతం ఎగురవేత తదితర కార్యక్రమాలతో కబడ్డీ మీట్ ప్రారంభమవుతుందని ప్రిన్సిపాల్ సీతాలక్ష్మి తెలిపారు. ఈ పోటీలను ప్రముఖ పారిశ్రామిక వేత్తలు మట్టే శ్రీనివాస్, మట్టే ప్రసాద్‌బాబు ప్రారంభిస్తారన్నారు. కృష్ణ, ఖమ్మం, బీదర్, వయనాడు , కడప, షిమోగా, తుముకురు క్లస్టర్‌ల నుంచి అండర్-14, అండర్-17 బాలుర, బాలికల విభాగంలో పోటీలు ఉంటాయని ప్రిన్సిపాల్ సీతాలక్ష్మి, పీఈటీలు ఆర్.సత్యనారాయణ, అనురాధ ఓ ప్రకటనలో తెలిపారు.

భర్తపై భార్య కత్తి పీటతో దాడి


దుర్గా ప్రసాద్ నుంచి స్టేట్ మెంట్ రికార్డు చేస్తున్న పట్టణ ఎస్సై కిషోర్‌బాబు

అమలాపురం టౌన్: తల్లికి వందనం డబ్బు ఏమి చేశావని అడిగినందుకు భర్తపై భార్య కత్తి పీటతో దాడి చేసి గాయపరిచింది. పట్టణ ఎస్సై ఎస్ఆర్ కిషోర్‌బాబు తెలిపిన వివరాల ప్రకారం...అమలాపురం పట్టణం సావరం రోడ్డులో సోమవారం ఈ ఘటన చోటు చేసుకుంది. సావరం రోడ్డులో నివాసం ఉంటున్న పెనుమాల దుర్గాప్రసాద్, దుర్గ దంపతులకు ఇద్దరు పిల్లలు. వారికి ఇటీవల తల్లికి వందనం పతకం కింద వచ్చిన డబ్బు ఏమి చేశావని భర్త దుర్గాప్రసాద్ భార్య దుర్గను అడిగాడు. దీంతో ఆగ్రహం వ్యక్తం చేసిన భార్య దుర్గ భర్తపై కత్తి పీటతో దాడి చేసి తీవ్రంగా గాయపరిచింది. అమలాపురం ప్రభుత్వ ఆస్పత్రిలో భర్త చికిత్స పొందుతున్నాడు. అతని నుంచి స్టేట్‌మెంట్ రికార్డు చేశారు. భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కిషోర్‌బాబు చెప్పారు.

చేపల వేటకు వెళ్లి మత్స్యకారుడి మృతి


సావదాల సత్యారావు (ఫైల్)

ధవళేశ్వరం: చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తూ గోదావరిలో పడి మత్స్యకారుడు మృతి చెందాడు. ధవళేశ్వరం పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. స్థానిక జలారుపేటకు చెందిన సావదాల సత్యారావు (43) సోమవారం తెల్లవారుజామున 4గంటల సమయంలో గోదావరిలో చేపలు పట్టేందుకు కాటన్ బ్యారేజీ వద్దకు వెళ్లాడు. బ్యారేజ్ స్కవర్ స్లూయిజ్ వద్ద ప్రమాదవశాత్తూ గోదావరిలో పడి మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ధవళేశ్వరం సీఐ టి.గణేష్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కారులో శిశువు జననం


కారులో పాపకు జన్మనిచ్చిన సారిక

ప్రత్తిపాడు రూరల్: కారులో పండంటి పాపకు ఓ మహిళ సోమవారం జన్మనిచ్చింది. మండలంలోని రాచపల్లికి చెందిన మడికి సారికకు సోమవారం పురిటి నొప్పులు రావడంతో స్థానిక ప్రభుత్వం ఆసుపత్రికి తీసుకువెళ్లారు. పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ గీత సెలవులో ఉండడంతో సిబ్బంది వైద్య సేవలు అందించారు. మెరుగైన వైద్యం నిమిత్తం ప్రత్తిపాడు కమ్యూనిటీ హెల్త్ సెంటర్ తీసుకువెళ్లాని సిబ్బంది సూచించారు. దీంతో గర్భిణి భర్త మడికి చిన్నిబాబు గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నేత, వైస్ ఎంపీపీ ఏనుగు శ్రీనుకు విషయం తెలిపారు. దీంతో వైస్ ఎంపీపీ శ్రీను తన కారు రాచపల్లి పీహెచ్‌సీకి పంపి గర్భిణిని ప్రత్తిపాడు కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు తరలించారు. రాచపల్లి దాటిన వెంటనే పోలవరం కాలువ వద్ద పురిటి నొప్పులు ప్రారంభం కావడంతో కారులో ఉన్న ఆశా వర్కర్ సమయస్ఫూర్తితో వ్యవహరించి పురుడు పోసింది. తిరిగి రాచపల్లి పీహెచ్‌సీకి తల్లీబిడ్డను తరలించి వైద్య సేవలు అందించారు.

చోరీపై కేసు నమోదు

రావులపాలెం: స్థానిక జాతీయ రహదారి సమీపాన ఉన్న రెడీమేడ్ క్లాత్ దుకాణంలో చోరీ జరిగిన ఘటనపై సోమవారం పోలీసులు కేసు నమోదు చేశారు. టీవీ సత్యనారాయణ రెడ్డి కాంపెల్క్స్‌లో ఉన్న మారుతి రెడీమేడ్ క్లాత్ దుకాణాన్ని మండలంలోని వెదిరేశ్వరం శివారు రాళ్ల గండికి చెందిన పబ్లిసిటీ సుబ్బారావు నిర్వహిస్తున్నాడు. ప్రతిరోజు ఉదయం వచ్చి పనులు ముగించుకుని రాత్రి ఇంటికి వెళతాడు. ప్రతి రోజూ లాగే 26వ తేదీ రాత్రి 10:30 గంటలకు దుకాణం మూసివేసి ఇంటికి వెళ్లాడు. 28వ తేదీ ఉదయం వచ్చేసరికి దుకాణం వెనుక తెలుపులు తెరిచి ఉండడంతో కౌంటర్ తనిఖీ చేయగా కౌంటర్‌లో ఉన్న రూ.40 వేల నగదు, 18 గ్రాముల బంగారు గొలుసు కనిపించలేదని గుర్తించాడు. ఈ ఘటనపై గుర్తు తెలియని వ్యక్తులు అపహరించుకుపోయినట్టు నిర్ధారించుకుని సుబ్బారావు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై కేసు దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ ఎం.శేఖర్‌బాబు తెలిపారు.

మొరాయించిన ప్రైవేటు ట్రావెల్ బస్సు

తీవ్ర ఇబ్బందులు పడిన ప్రయాణికులు పట్టించుకోని యాజమాన్యం


మల్లేపల్లిలో ప్రయాణికుల నుంచి వివరాలు తెలుసుకుంటున్న పోలీసులు

గండేపల్లి: జాతీయ రహదారిపై సోమవారం ఓ ప్రైవేటు ట్రావెల్ బస్సు మొరాయించడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వివరాల్లోకి వెళితే.. విశాఖపట్నం నుంచి ఆదివారం రాత్రి హైదరాబాద్‌కు ప్రయాణికులతో కావేరి ట్రావెల్ బస్సు బయలుదేరింది. మండలంలోని మల్లేపల్లి శివారు హోటల్ వద్ద భోజనాలు చేసేందుకు బస్సును డ్రైవర్ నిలిపాడు. భోజనాలు అనంతరం బస్సును స్టార్ట్ చేయగా మొరాయించింది. స్థానికంగా ఉన్న మెకానిక్ మరమతులు చేసినప్పటికీ ఉపయోగం లేకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సమస్యలను బస్సు యాజమాన్యానికి వివరించినా సరిగా స్పందించలేదని ప్రయాణికులు తెలిపారు. మరో బస్సులో గమ్యానికి పంపించాలని కోరామని, కనీసం టికెట్ సొమ్మయినా ఇస్తే మరో బస్సులో వెళతామని చెప్పినప్పటికి పట్టించుకోలేదన్నారు. దీనిపై ప్రయాణికులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. గండేపల్లి పోలీసు సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని ప్రయాణికుల నుంచి వివరాలు సేకరించారు. దీంతో యాజమాన్యం స్పందించి ప్రయాణికులకు భోజన సదుపాయం, ప్రయాణ సౌకర్యం కల్పించినట్టు పోలీసులు తెలిపారు.

రైలు ఢీకొని ట్రాక్‌మన్ మృతి

తుని: రైలు ఢీకొని రైల్వే ట్రాక్‌మన్ మృతి చెందిన ఘటనపై కేసు నమోదు చేసినట్లు స్థానిక జీఆర్పీ హెడ్ కానిస్టేబుల్ మోహన్‌రావు సోమవారం తెలిపారు. వివరాల్లోకెళితే.. తుని రైల్వేస్టేషన్ పరిధిలోని గుల్లిపాడు–నర్సీపట్నం రైల్వేస్టేషన్ల మధ్య అనకాపల్లి జిల్లా ఎస్.రాయవరం మండలం, పెట్టుగొల్లపల్లి గ్రామానికి చెందిన రైల్వే ట్రాక్‌మెన్ కురందాసు అప్పారావు(57) విధి నిర్వహణలో ఉండగా గుంటూరు నుంచి రాయగడ వెళ్లే ట్రైన్ ఢీకొట్టింది. అతను అక్కడికక్కడే మృతి చెందాడు. శవ పరీక్ష అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించినట్లు హెచ్‌సీ మోహన్‌రావు తెలిపారు.

బాలికపై పాఠశాల కరస్పాండెంట్ అత్యాచారం

పోలీసులను ఆశ్రయించిన తండ్రి

రాయవరం: ప్రైవేట్ పాఠశాల కరస్పాండెంట్ అదే పాఠశాలలో చదువుతున్న బాలికపై అత్యాచారం చేసిన ఘటన రాయవరం మండలంలో చోటు చేసుకుంది. మండలంలోని గ్రామానికి చెందిన ఒక పాఠశాలకు 1వ తరగతి నుంచి 7వ తరగతి వరకు చదువు చెప్పేందుకు అనుమతి ఉంది. అయితే పాఠశాల కరస్పాండెంట్ అనుమతి లేకుండా 10వ తరగతి వరకు విద్యార్థులకు తన పాఠశాలలో విద్యాబోధన చేస్తున్నాడు. 10వ తరగతి చదువుతున్న బాలికకు మాయమాటలు చెప్పి, భయపెట్టి లోబర్చుకున్నట్లు తెలిసింది. కొద్ది నెలల క్రితం తల్లిదండ్రులు బాలికను ప్రైవేట్ ఆస్పత్రిలో చూపించగా, పరీక్షలు చేసిన వైద్యులు బాలిక గర్భవతి అని నిర్ధారించినట్లు సమాచారం. దీంతో తల్లిదండ్రులు బాలికను నిలదీయడంతో పాఠశాల కరస్పాండెంట్ అకృత్యానికి పాల్పడినట్లుగా బయటపెట్టింది. దీంతో బాలిక తండ్రి రాయవరం పోలీసులను ఆశ్రయించారు. పాఠశాలకు 7వ తరగతి వరకు అనుమతి ఉంటే..పదవ తరగతి బాలికలు ఏ విధంగా చదువుతున్నారన్నది అధికారుల విచారణలో తేలాల్సి ఉంది. బాలికలను వేరే పాఠశాలలో అడ్మిషన్ ఇచ్చి, అనధికారికంగా ఈ పాఠశాలలో విద్యాబోధన చేయిస్తున్నట్లుగా తెలుస్తోంది. అయితే ఏ పాఠశాలలో అడ్మిషన్ ఇచ్చారన్నది తేలాల్సి ఉంది. దీనిపై రాయవరం ఎస్సై డి.సురేష్‌బాబును వివరణ కోరగా, ఫిర్యాదు వచ్చిన విషయం వాస్తవమేనని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేయనున్నట్లు తెలిపారు.